



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 333 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 3 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :333 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 3 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఏపీలో తక్కువ ధరకే బియ్యం..

### అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

- సామాన్యులకు ఊరటనిస్తూ ప్రభుత్వ బియ్యం అమ్మకాలు
- విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతు బజార్లు, మిల్లుల్లో కేజీ రూ. 50, రూ. 52కే బియ్యం
- త్వరలో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరకే

- మిగతా 2లో

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన జగన్



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.
ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు. చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు

- మిగతా 2లో



## ఇంటింటికీ టీడీపీ

### ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు..

### ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనమన్న లోకేశ్

- ఏపీలో ఇంటింటికీ టీడీపీ
- 7 రోజుల్లో 17.61 లక్షల కుటుంబాలను కలిసిన కూటమి శ్రేణులు
- ఆదివారం సెలవు రోజైనా 3 లక్షలకు పైగా గృహాలను సందర్శించిన నేతలు
- టెలీకాన్ఫరెన్స్ ద్వారా పురోగతిని సమీక్షించిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- టెక్నాలజీతో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నారా లోకేశ్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ -- 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి--సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఏడో రోజైన ఆదివారం కూడా ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఏడు రోజుల్లో కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17,61,197 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏ మాత్రం విరామం తీసుకోకుండా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడో రోజు ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,01,197 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, గత రెండేళ్లలో ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారదర్శక పాలన వంటి రంగాల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను గణాంకాలతో

- మిగతా 2లో

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

## కోర్టులో హాజరు

- ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేసిన పోలీసులు
- టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు
- ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు
- అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం

- మిగతా 2లో





## ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు

- ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ఫలితంగా కుదిరిన ఎంవోయూలు
- లోకేష్, ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో సంతకాలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య బంధం మరింత బలపడింది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకుంటూ ఇరుపక్షాలు నాలుగు వ్యూహాత్మక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకు న్నాయి. ఉండవల్లిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి సహాయ మంత్రి జూలియన్ హిల్ హాజరయ్యారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన సందర్భంగా అక్కడి సంస్థలతో జరిపిన చర్చలు, ఏపీలో పెట్టుబడులకు

- మిగతా 2లో

## గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

- గోదావరికి కొనసాగుతున్న వరద ఉద్ధృతి
- కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపులో లంక గ్రామాలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన బోట్లు, రవాణా సౌకర్యాలు
- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వశిష్ఠ, గౌతమి పాయలు
- అప్రమత్తమైన అధికారులు, కొనసాగుతున్న సహాయక చర్యలు

**పెన్ పవర్ డెస్క్:**ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం

- మిగతా 2లో





## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

### ఆగస్టు 5న కీలక నిర్ణయం

- రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకోనున్న కాక్రోచ్ జనతా పార్టీ
- ఆగస్టు 5న అభిజీత్ దీప్కే నివాసంలో కీలక కోర్ కమిటీ సమావేశం
- నీట్ పేపర్ లీక్ నిరసనల విజయంతో ఉద్యమ సంస్థపై పెరిగిన అంచనాలు
- ఉద్యమంగానే కొనసాగాలా లేక పార్టీ పెట్టాలా అనే దానిపై స్పష్టత
- సమావేశం తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించనున్న అభిజీత్ దీప్కే

- మిగతా 2లో



## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం..

## యువతకు ప్రధాని మోదీ పిలుపు

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని

- మిగతా 2లో

## హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు.. కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు



- హైడ్రాకు సంఘీభావం తెలుపుతూ నగరంలో పలు సంక్షేమ సంఘాల ర్యాలీలు
- వరద కట్టడి, చెరువుల పరిరక్షణ చర్యలను స్వాగతించిన నగరవాసులు
- రెండేళ్లలో రూ. 1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిందని ప్రశంసలు
- సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండిస్తూ.. హైడ్రాను కొనసాగించాలని డిమాండ్
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి

- మిగతా 2లో

## పెరూలో ఘోర విమాన ప్రమాదం..

## 13 మంది టూరిస్టులు మృతి

**పెన్ పవర్ డెస్క్:** పెరూలో ఘోర విమాన ప్రమాద జరిగింది. నాజ్కా నగర సమీపంలో పర్యాటకులతో వెళ్తున్న విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 13 మంది మరణించినట్లు ఆ దేశ రవాణా, సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది. పెరూలోని ప్రసిద్ధ నాజ్కా లైన్స్‌ను సందర్శించేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద

- మిగతా 2లో






## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం.. యువతకు ప్రధాని మోదీ పిలుపు

దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు.దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. “మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం” అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. “కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి” అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు.యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. “రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి” అని పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

- మొదటి పేజి తరువాయి

నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక - గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.రాజమండ్రి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది.మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

## పెరూలో ఘోర విమాన ప్రమాదం.. 13 మంది టూరిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

సమయంలో విమానంలో 11 మంది విదేశీ పర్యాటకులు ఇద్దరు సిబ్బంది ప్రయాణిస్తున్నారని.. ఈ ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదు. సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ టీమ్స్ ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గురైన విమానాన్ని సెస్నా కారవాన్ జ-208 ఫ్లైట్?గా అధికారులు గుర్తించారు. ప్రత్యేక పర్యాటక విమానాలను నడిపే ఏరోడియానా అనే ఎయిర్ లైన్స్ కంపెనీ ఈ విమానాన్ని నడుపుతున్నట్లు పెరూ రవాణా, సమాచార మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇటలీ, జర్మన్, స్పానిష్?కు చెందిన 11 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బందితో నాజ్కా లైన్స్ విహారయాత్ర యాత్ర కోసం శనివారం (ఆగస్ట్ 1) మధ్యాహ్నం 12:10 గంటలకు పిస్కో విమానాశ్రయం నుంచి ఫ్లైట్ బయలుదేరింది.టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ప్యూబ్లో నుయెవో జిల్లాలోని సోకోస్ సమీపంలో ఏటీసీతో విమానం సంబంధాలు కోల్పోయింది. ఆ తర్వాత కాసేపటికే నాజ్కా నగర సమీపంలో ఫ్లైట్ క్రాష్ అయ్యింది. ప్రమాదానికి గల కారణాన్ని నిర్ధారించడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఏవియేషన్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ కమిషన్ దర్యాప్తు ప్రారంభించిందని అధికారులు తెలిపారు.

# ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు

- మొదటి పేజి తరువాయి

ఇచ్చిన ఆహ్వానం ఫలితంగానే ఈ ఒప్పందాలు సాకారమయ్యాయి.

**1. ఐఐటీ తిరుపతిలో సోలార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

మొదటి ఒప్పందం ప్రకారం, విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఖచీూఔ) కలిసి ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం. ఈ సెంటర్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయి. సోలార్ సెల్ ఫిజిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్, వాఫరింగ్ టెక్నాలజీస్ వంటి అంశాలపై కరిక్యులమ్, శిక్షణా కార్యక్రమాలను ఖచీూఔ రూపొందించి సహకారం అందిస్తుంది.

**2. సమ్మిళిత విద్య బలోపేతం కోసం**

రెండో ఒప్పందం సమ్మిళిత విద్యపై దృష్టి సారించింది. యూఎన్ఎస్‌డబ్ల్యూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. స్పెషల్ ఎడ్యుకేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, రాష్ట్ర విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధనా వనరులను రూపొందిస్తారు.

**3. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై పైలట్ ప్రాజెక్ట్**

మూడో ఒప్పందంలో భాగంగా ఏపీ ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి రాష్ట్రంలోని ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే దీని లక్ష్యం. ప్రత్యేకంగా రూపొందించిన వేదిక ద్వారా విద్యార్థులు తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సలహాలు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్టును ఉచితంగా అమలు చేయనున్నారు.

**4. నైపుణ్యాభివృద్ధికి డీఎల్ఎస్‌తో భాగస్వామ్యం**

నాలుగో ఒప్పందం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ూూూణజ), ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ (ణూూ) మధ్య కుదిరింది. వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయి. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించి, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం దీని ప్రధాన లక్ష్యం.ఈ ఒప్పందాలకు ముందు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఏపీలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, చెన్నైలోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు.. కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి.అమీర్‌పేట, మధురా నగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి.గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు.ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు.కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగాలని నినాదాలు చేశారు.

ఇటీవల, హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలంటూ తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, నేటి ప్రజా ర్యాలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఇంటింటికీ టీడీపీ ఏడు రోజుల్లో 17.61 లక్షల ఇళ్లకు.. ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనమన్న లోకేశ్

- మొదటి పేజి తరువాయి

సహా తెలియజేశారు.ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సెలవు రోజు కూడా కష్టపడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

మరోవైపు, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సూచనలు చేస్తున్నారు. ఆదివారం కూడా విశేష ఉత్సాహంతో పాల్గొనడం, ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన చూస్తుంటే ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం స్పష్టమవుతోందని లోకేశ్ అన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ పనితీరును వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్.. కోర్టులో హాజరు

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

**అసలేం జరిగింది?**

చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**పోలీసుల కథనం ప్రకారం..**

వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

**అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ**

అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాముకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

**ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం**

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. “ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు. వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు. అలాగే వారిని వారించబోయిన రాజశేఖర్, నాగరాజు అన్నపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని పరామర్శించడానికి వచ్చిన స్థానిక నాయకుడు కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. జరిగింది ఇది కాగా అక్రమంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం చేయడం సబబు కాదు” అని ఏపీ ఫ్యాక్ట్ చెక్ వివరించింది.కాగా, ఈ అరెస్టులతో ఆలూరు నియోజకవర్గంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

## ఏపీలో తక్కువ ధరకే బియ్యం.. అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు.ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. “ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం” అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోం దని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు.ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. “అధికారం, పోలీసు బలం శాశ్వతం కాదు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అర్ధరాత్రి అరెస్టులు చేసినా వైసీపీ వెనక్కి తగ్గదు. బాధితులకు అండగా నిలుస్తూ అరాచక పాలనపై పోరాటం కొనసాగిస్తాం” అని జగన్ స్పష్టం చేశారు.

## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి.వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి.అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# గురుకులంలో పుస్తకాలు కాదు...
# చీపురు పట్టించారు..!

విద్యార్థులతో రూములు
శుభ్రం చేయిస్తున్న సిబ్బంది
బాల కార్మిక చట్టం ఉల్లంఘన
"పెన్ పవర్" పరిశీలనతో
వెలుగులోకి వచ్చిన ఘటన






**మార్కాపురం/కొనకనమిట్ల, పెన్ పవర్ ఆగస్టు 2**

విద్యార్థులు విద్యాభ్యాసం,క్రీడలు,వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండాల్సిన గురుకుల విద్యాసంస్థలో వారికి చదువుకు బదులుగా శుభ్రత పనులు అప్పగించడం తీవ్ర విమర్శలకు దారితీసింది.మార్కాపురం జిల్లా కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల,వసతి గృహంలో విద్యార్థులతో హాస్టల్ రూములు,పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ఘటన "పెన్ పవర్" ప్రతినిధి ఆదివారం నిర్వహించిన ఆకస్మిక సందర్శనలో వెలుగులోకి వచ్చింది.పరిశీలన సమయంలో కొందరు విద్యార్థులు చీపుర్లతో హాస్టల్ హాల్స్‌ను శుభ్రం చేస్తూ కనిపించారు.పుస్తకాలు పట్టాల్సిన చేతుల్లో చీపుర్లు కనిపించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది.సెలవు రోజునైనా విద్యార్థులకు విశ్రాంతి,స్వయం అధ్యయనం లేదా క్రీడలకు అవకాశం కల్పించాల్సిన పరిస్థితిలో శుభ్రత పనులు చేయించడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సిబ్బంది ఉండగా విద్యార్థులతోనే పనులు?**

గురుకులంలో పారిశుధ్య నిర్వహణ కోసం అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించినప్పటికీ వారితో పనులు చేయించకుండా విద్యార్థులతోనే హాస్టల్ నిర్వహణ పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రోజువారీగా విద్యార్థులతో ఇలాంటి పనులు చేయించడం వల్ల వారి చదువుపై ప్రభావం పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

**బాలల హక్కులకు భంగం?**

విద్యార్థుల చేత బలవంతంగా శ్రమ చేయించడం బాలల హక్కులకు విరుద్ధమని 14 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయించడం బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం నిబంధనలకు వ్యతిరేకమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విద్యాసంస్థల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ఒక విషయం అయితే శుభ్రత నిర్వహణ బాధ్యతలను పూర్తిగా విద్యార్థులపై మోపడం సమంజసం కాదని పలువురు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధంగా నిర్వహణ**

పేద గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతిభోజనం,అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది.అయితే క్షేత్రస్థాయిలో ఇలా విద్యార్థులతో పనులు చేయిస్తున్న ఘటనలు చోటుచేసుకోవడం గురుకుల వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఈ ఘటనపై జిల్లా గురుకుల సంక్షేమ అధికారులు,జిల్లా విద్యాశాఖ అధికారులు,కార్మిక శాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలనీ నిబంధనలు ఉల్లంఘించినట్లయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గురుకులాల్లో పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# మాంసం ప్రియుల కష్టాలు...
# వ్యాపారుల ఇష్టారాజ్యం

-రోడ్లపైనే చికెన్, మటన్ అమ్మకాలు
-ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 2**

సండే వచ్చిందంటే చాలు... ప్రతి ఇంట్లో నాన్ వెజ్ ఘుమఘుమలాడాలి. కానీ ఆ మాంసం కొనడానికి బయటికి వెళ్లాలంటే మాత్రం మార్కాపురం ప్రజలు నరకం చూస్తున్నారు. పట్టణంలో చికెన్, మటన్ షాపుల పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. శుభ్రత, నాణ్యత గాలికి వదిలేసి వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యాపారం చేస్తున్నారు.

**రోడ్లపైనే వ్యాపారం... దుర్వాసనతో ఇబ్బంది**

పట్టణంలోని ప్రధాన రోడ్లు, సందుల్లో ఎక్కడపడితే అక్కడే చికెన్, మటన్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రోడ్డుపైనే మేకలు, పొట్టేళ్లను కోసి, రక్తం, వ్యర్థాలను అక్కడే పారబోస్తున్నారు. దీంతో ఆ దారిలో వెళ్లే పాదాచారులు, బైక్, కారులో వెళ్లే వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి. పిల్లలు, వృద్ధులు ఆ దుర్వాసనకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

**అనుమతులు లేకుండానే కోతలు... నాణ్యత గల్లంతు**

మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే బహిరంగంగా జంతువులను కోస్తున్నారు. ఫ్రిజ్‌లు లేవు, శుభ్రమైన నీరు లేదు. ఈగలు ముసురుతున్న మాంసాన్ని కడిగి అమ్ముతున్నారు. ఆరోగ్యం గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

**అధికారులు నిద్రపోతున్నారా?**

ఇన్ని సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం కళ్లు మూసుకుని ఉన్నారు. ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు లేవు. వ్యాపారుల నుంచి నెలవారీ ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్, ఆహార భద్రత అధికారులు వెంటనే స్పందించి అక్రమ షాపులను తొలగించి, నిర్దేశిత ప్రదేశాల్లోనే శుభ్రంగా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# డీఎస్సీ అక్రమ నియమకాలపై సమగ్ర విచారణ జరపాలి

-డీఎస్సీ 2025లో జరిగిన అక్రమ నియామకాలపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తాము
-విద్యాశాఖ మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి -బుర్రా డిమాండ్


ఫైల్ ఫోటో

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 2**

డీఎస్సీ పేపర్ లీకేజీ, స్పోర్ట్స్ కోటా పేరిట అన్యాయాలు నేపథ్యంలో డీఎస్సీలో అక్రమ నియామకాలపై ప్రజల్లోకి తీసుకువెళ్లి చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చేసిన అన్యాయంపై యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నామని కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. డీఎస్సీ అక్రమ నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని, డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని, పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీ వరకు జరిగిన ప్రతి అక్రమంపైన సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాము. ప్రతిభతో ఉద్యోగాలు సాధించాల్సిన యువతను రోడ్డెక్కించిన పాపం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. టీచర్ ఉద్యోగం కోసం రాత్రింబవళ్లు శ్రమించిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాల్సిన చంద్రబాబు ప్రభుత్వం డీఎస్సీలో లీకులు, అక్రమాలతో వారి భవిష్యత్తును కాలరాసింది అని అన్నారు. సాక్ష్యాలు, ఆధారాలు కళ్ల ఎదుటే కనిపిస్తా ఉన్నా సీఎం చంద్రబాబు కానీ, విద్యాశాఖమంత్రి లోకేష్ కానీ ఇప్పటివరకూ వాటిమీద నోరుమెదపలేదు. డైవర్షన్లతో కప్పిపెట్టాలని చూస్తున్నారు. నిరుద్యోగయువత డిమాండ్లను సాధించే క్రమంలో యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో మరిన్ని రూపాల్లో ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రస్థాయికి తీసుకెళ్తాం. దానిలో భాగంగా రేపు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుండి స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీఎస్సీ అక్రమాలపై సదస్సు నిర్వహిస్తున్నాము అని అన్నారు. విద్యావేత్తలు మేధావులు ప్రజాస్వామిక వాదులు పాల్గొంటారు అని అన్నారు. ఈ కార్యక్రమానికి డీఎస్సీ ఆశావహులైన అభ్యర్థులు నిరుద్యోగ యువత విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# ఎడ్ల పందాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి








**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఆగష్టు 2**

మండలం శామీరపాలెం (కూనిపాలెం) గ్రామంలో గంగమ్మ తల్లి తిరుణాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రకాశం, బాపట్ల జిల్లాల స్థాయి ఎడ్ల పందేలను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. మొత్తం ఏడు జతల ఎడ్లు, ఈ పందేలలో పాల్గొన్నాయి. ఎడ్ల పందేలను చూసేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు వచ్చి తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా రైతు కుటుంబాల్లో ఎద్దులు కుటుంబ సభ్యులలాంటివని, పండుగ వాతావరణంలో ఇలాంటి పందేలు నిర్వహించటం ఆనందంగా ఉందని అన్నారు. పల్లెల్లో రైతుల ఆచార సంప్రదాయాలను తప్పకుండా కొనసాగించాల్సిన అవసరం ఉందని, అప్పుడే నేటి తరానికి వాటిపై అవగాహన కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, మాజీ సర్పంచ్ నవులూరి రాజా రమేష్, గ్రామ నాయకులు అనుమోలు సుధాకర్, నేతి నరసింహం, మానికొండ మాధవరావు, తాటికొండ రమణయ్య, ఘట్టమనేని మాల్యాద్రి, చెంచునాయుడు, క్లస్టర్ ఇంచార్జి కాకుమాని హర్ష, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.



# చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయం



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 02**

గిద్దలూరు పట్టణంలో శనివారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికె పలు కాలనీలు, ప్రధాన రహదారులు జలమయ మయ్యాయి. వర్షంతో కశెట్టి వారి బజార్, పాండురంగ రెడ్డి నగర్, పొట్టి శ్రీరాములు రోడ్డు సమీప ప్రాంతం, చిన్న మార్కెట్, కృష్ణ థియేటర్ పరిసరాలు, ఇతర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువులను తలపించాయి. రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు, ద్విచక్రవాహనదారులు, పాదచా రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం తగ్గిన తర్వాత కూడా కొన్ని ప్రాంతాల్లో గంటలపాటు నీరు నిలిచి ఉండగా, నీరు వెళ్లిపోయిన అనంతరం రోడ్లు బురదమయంగా మారాయి. చెత్త చెందారు రోడ్లపై చేరింది . పట్టణంలో డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేకపోవడం, ఉన్న కాలువల్లో చెత్త చెదారాలు ఖాళీ వాటర్ బాటిల్స్, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయటం వలన , మరికొందరు ఇండ్ల నిర్మాణం సమయంలో సైడ్ కాలువలను పూడ్చి వేయటం వలన పూడిక పేరుకుపోవడం,మే కాకుండా, కొందరు డ్రైనేజీ కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, కారణం గా పలువురు అంటున్నారు మున్సిపల్ కార్యాలయం సమీపంలోనే సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు కార్యాలయ ఆవరణలోకి చేరనది. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ శాశ్వత చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. పాండు రంగారెడ్డి నగర్లో పెద్ద డ్రైనేజీ ఉన్నా అందులో పూడిక చేరి వర్షానికి వచ్చేనీరు కాల్వ సరిపోక రోడ్డుపై నే మురుగు నీరు ప్రవహిస్తోంది. దాదాపుగా మోకాటి లోతు నీరు రోడ్డుపైనే ప్రహించటం తో ప్రజలు పలుఇబ్బందులు పడుతున్నారు. ఆ నీరు వెళ్లిపోయినతరువాత ఆ నల్లటి బర్దను ఆప్రాంత వాసులు నీళ్లు పోసి కడుక్కోవాల్సిన దుస్థితి ఈ తంతు కొన్ని సంవత్సరాలుగా జరుతోంది. ఏదిఏమైనా ఏపాటి వర్షం వచ్చినా పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అవుతున్నాయి. వాహన చోదకుల ఇబ్బందులు పడుతున్నారు.

# కందుకూరు సబ్-డివిజన్‌లో సెక్షన్-30 అమలు

### -ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, సభలకు నిషేధం

### -డీఎస్పీ బాలసుబ్రమణ్యం



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 2**

ప్రస్తుత పరిస్థితులు, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా కందుకూరు సబ్-డివిజన్ పరిధిలో ఇండియన్ పోలీస్ యాక్ట్ సెక్షన్-30ను అమలు చేస్తున్నట్లు సబ్-డివిజనల్ పోలీస్ అధికారి (డీఎస్పీ) బాలసుబ్రమణ్యం ప్రకటించారు. ఈ మేరకు ముందస్తు పోలీసు అనుమతి లేకుండా ఎలాంటి నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, సభలు, ధర్నాలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించాలనుకునే నిర్వాహకులు తప్పనిసరిగా ముందుగానే పోలీసు శాఖ నుంచి అనుమతి పొందాలని సూచించారు. ఉత్తర్వులను ఉల్లంఘించి అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహించినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కందుకూరు సబ్-డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని సబ్-డివిజనల్ పోలీస్ అధికారి విజ్ఞప్తి చేశారు.

# 16వ బ్లాకులో టీడీపీ డోర్ టు డోర్ కార్యక్రమం



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 2**

నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 16వ బ్లాకులో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ వార్డు అధ్యక్షులు ధనంకుల హరిబాబు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఉపాధ్యక్షులు పంట సుబ్బారావు, టీడీపీ సీనియర్ నాయకులు కోమెర ఏడుకొండలు, బూత్ కన్వీనర్ పంట వెంకటసుబ్బయ్య తో పాటు వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్న తీరును తెలుసుకుని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హరిబాబు తెలిపారు.

# 41 సెల్‌ఫోన్లు రికవరీ బాధితులకు అందజేత



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగస్టు 2**

నియోజకవర్గంలో ప్రజలు పోగొట్టుకున్న,చోరీకి గురైన రూ.8 లక్షల విలువైన 41 సెల్‌ఫోన్లను పోలీసులు విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం సీఐ కె అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఐటీ కోర్ బృందం, క్రైమ్ టీమ్ సంయుక్తంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ అజయ్‌కుమార్ బాధితులకు వారి సెల్‌ఫోన్లను అందజేశారు. ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందించిన ఈ సందర్భంగా సీఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఫిర్యాదులను వేగంగా స్పందించి,ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, సాంకేతిక ఆధారాలతో తక్కువ సమయంలోనే 41 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. ఇందుకు కృషి చేసిన పోలీసు సిబ్బంది, ఐటీ కోర్, క్రైమ్ బృందాలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బాధితులు తమ విలువైన సెల్‌ఫోన్లు తిరిగి అందడంతో ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ, సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్త ప్రయాణానికి నాంది పలికిన ప్రకాశం డిప్లొమా ఫ్రెషర్స్ వేడుక








**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 2**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశం పొందిన డిప్లొమా విద్యార్థులకు ఆదివారం ఫ్రెషర్స్ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్, కళాశాల కోశాధికారి, ఎమ్మెల్సీ డా. కె. శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, డిప్లొమా విద్యార్థులకు కూడా బీటెక్ విద్యార్థులతో సమానంగా పోటీ పడే అవకాశాలను కళాశాల యాజమాన్యం కల్పిస్తోందని తెలిపారు. కళాశాల అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. నైపుణ్యాలే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని, మెరుగైన స్థిరపడే అవకాశాలను అవే కల్పిస్తాయని అన్నారు.అనంతరం ఎమ్మెల్సీ డా. కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వికేంద్రీకరణ విధానంతో యువతకు వివిధ ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటోందని అన్నారు. నైపుణ్యాలు కలిగిన యువతకు ప్రభుత్వం మెరుగైన అవకాశాలు అందించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఫ్రెషర్స్ వేడుకలో పాల్గొనడం ద్వారా తన విద్యార్థి దశలోని మధుర జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగిస్తూ తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్య ప్రదర్శనలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. అనంతరం విద్యార్థులకు ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ వి. హరిబాబు, అకాడమిక్ ఇన్‌చార్జి మీరావలి, డా. జి. ప్రసాద్, డిప్లొమా పరీక్షల విభాగం ఇన్‌చార్జి అల్లా బగాష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ ఆరోగ్య హాస్పిటల్‌లో అరుదైన ఆపరేషన్లు

### మూడు ఆపరేషన్లు విజయవంతం

### సర్జన్ డాక్టర్ కే. కళ్యాణ్ కుమార్ రెడ్డి



**మార్కాపురం, పెన్ పవర్ ఆగష్టు 2**

తీవ్రమైన కడుపు నొప్పితో ఆస్పత్రికి వచ్చిన ముగ్గురు రోగులకు మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎన్ఎస్ నగర్‌లో ఉన్న శ్రీ ఆరోగ్య హాస్పిటల్‌లో అరుదైన అత్యవసర శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించి వైద్యులు వారి ప్రాణాలను కాపాడారు. శ్రీశైలం ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలుడికి తీవ్ర కడుపు నొప్పితో ఆస్పత్రికి రాగా, పరీక్షల్లో పేగులో రంధ్రం ఏర్పడినట్లు గుర్తించారు. వెంటనే ఎమర్జెన్సీ లాపరోటమీ నిర్వహించి పేగులోని రంధ్రాన్ని సరిచేసి, ఉదరంలోని ఇన్ఫెక్షన్‌ను నియంత్రించారు. ప్రస్తుతం బాలుడు కోలుకుంటున్నాడు. అదే విధంగా బెస్తవారిపేటకు చెందిన ఓ రోగికి పెద్దపేగులోని సిగ్మాయిడ్ భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించి సిగ్మాయిడ్ కోలెక్టమీ నిర్వహించి దెబ్బతిన్న 80 సెంటీమీటర్ల పెద్ద పేగును తొలగించారు. అనంతరం రోగి కోలుకునే వరకు కోలోస్టమీ ఏర్పాటు చేశారు. తర్లుపాడుకు చెందిన మరో రోగికి లివర్ లో పేరుకుపోయిన చీమును తొలగించి, శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు రోగుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ శస్త్రచికిత్సలను డాక్టర్ కే. కళ్యాణ్ కుమార్ రెడ్డి (జనరల్, లాపరోస్కోపిక్ అండ్ క్యాన్సర్ సర్జన్) ఆధ్వర్యంలో డా. ఎన్. మనోజ్ కుమార్, డా. కే. అభినవ్, డా. డి. లతలతో కూడిన వైద్య బృందం విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ కే. కళ్యాణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తీవ్రమైన కడుపు నొప్పి, జ్వరం, వాంతులు, కడుపు బిగుసుకుపోవడం, మలం వెళ్లకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో చికిత్స అందితే ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు.ఇప్పటివరకు ఇలాంటి క్లిష్ట శస్త్రచికిత్సల కోసం గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు మార్కాపురంలోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులకు తక్కువ ఖర్చుతో అందుబాటులోని నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని డాక్టర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణ సభను జయప్రదం చేయండి

### బిరాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబుబి

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 2**

దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 20% కు పెంచాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ హోదా కల్పించాలని, ప్రైవేట్ రంగాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం జిల్లా మాలలు జేఏసీ మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6న మార్కాపురంలో రాజ్యాంగ పరిరక్షణ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు తెలిపారు.ఈ సభను జయప్రదం చేయాలని జిల్లాలోని మాలలు, దళితులు అందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలల జేఏసీ జిల్లా అధ్యక్షులు మాలపోలు సంతకుమార్, మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపనపల్లి సామ్యూల్, ప్రధాన కార్యదర్శి మంచా సాయి, గౌరవ అధ్యక్షుడు జనుమాల నాగయ్య, ఉపాధ్యక్షులు గొట్టిముక్కల యోహాను, ట్రెజరర్ కొంగ్రు పిచ్చయ్య వెంకటస్వామి తో పాటు రాష్ట్ర జేఏసీ లీగల్ అడ్వైజర్ బాల నారాయణ, రాష్ట్ర నాయకులు కేడం విశ్వనాథం, మెండెం లక్ష్మయ్య, తప్పేట్ల శ్రీను, పెరికె జయరావు, ఎల్లిసెట్టి కోటేశ్వరరావు, అంబడిపూడి చిన్న రామాంజనేయులు, కూకట్లపల్లి అబ్బన్న, టీచర్ మోజెష్, దార్ల సురేష్, దార్ల అశోక్, ఎం. శంకర్, శ్రీధర్ల రమేష్ బాబు, గుల్ల విజయ్, సిరిపల్లె వరప్రసాద్‌లి, గౌరవ సలహాదారుడు పరదేశి రాజశేఖర్, కల్వకురి శాంతరాజు, కొటికల బాలబాబు, జనుమాల సుభాష్, కోలనిడి బాలు తదితర మాల సంఘాల నాయకులు పాల్గొంటారు.




# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఆదర్శం - ఇమ్మడి కాశీనాథ్



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 2**

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడు పి. పాండు రంగ విఠల్ ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ మార్కాపురం జిల్లా నాయకులు ఇమ్మడి కాశీనాథ్ పాలుగున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవనీయమైనదని అన్నారు. గత 36 సంవత్సరాలుగా పాండు రంగ విఠల్ ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారని, ఉపాధ్యాయుడు అంటే కేవలం పాఠాలు చెప్పేవాడు కాదు, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి అని కొనియాడారు. ఒక మంచి ఉపాధ్యాయుడు వందలాది మంది డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులను తయారుచేస్తాడని, పాండు రంగ విఠల్ కృషి అందుకు నిదర్శనమని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారికి మెరుగైన సౌకర్యాలు, గౌరవం కల్పించినప్పుడే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా విద్య, విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాబోయే రోజుల్లో విద్యా వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకువస్తామని తెలిపారు. పాండు రంగ విఠల్ రెండో జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీర బ్రహ్మం, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు రమణ, సీపీఐ పార్టీ నాయకులు అందే నాసారయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వై.వి. సుబ్బారెడ్డిని కలిసిన డాక్టర్. అశోక్ కుమార్.

### అద్దంకి నియోజకవర్గ రాజకీయాలపై ఇరువురి చర్చ



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 02:**

రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు వై.వి. సుబ్బారెడ్డిని అద్దంకి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఒంగోలులోని సుబ్బారెడ్డి నివాసానికి వెళ్లిన డాక్టర్. అశోక్ కుమార్ ఆయనను ఆత్మీయంగా పలకరించారు. ?ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా అద్దంకి నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ శ్రేణులను కలుపుకుపోతూ ముందుకు సాగే భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై ఇరువురు నాయకులు కాసేపు చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల పితామహుడు నకారా



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 2**

పెన్షనర్ల పితామహుడు డి. ఎన్. నకారా గా పలువురు అభివర్ణించారు. ఆదివారం నాడు పొదిలిలో నీ పెన్షనర్ల భవన్ లో ఘనంగా నకారా వర్ధంతి వేడుకలు జరిగాయి. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ మదర్ వలి ఆధ్వర్యంలో వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల కోసం నకారా చేసిన సేవలను వివరించారు. అటువంటి మహనీయుని ఆశయ సాధన కోసం పెన్షనర్లందరూ గట్టి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు ఏ బాదుల్లా, డిఎల్ నరసింహారావు, ఏ వీరారెడ్డి, డివి సుబ్బారావు, భాష మొహిద్దిన్, జానీ బేగ్, ఎల్లమందరెడ్డి, కే శ్రీనివాసరెడ్డి, గోవిందయ్య, చంద్రావతి, ఎలేజర్, మీరావలి, ఫకీర్ అహ్మద్, కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు లో ఒక మోస్తరు వర్షం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 02**

గిద్దలూరు లో శనివారం రాత్రి ఒక మోస్తరు వర్షం కురిసింది. మార్కాపురం డివిజన్ లోని మొత్తం గా 91. 6 వర్షం నమోదైంది డివిజన్లోలో ,మార్కాపురం, పెద్దారవీడు, దోర్నాల, వైపాలెం త్రిపురాంతకం, పుల్లల చెరువు లలో వర్షపు జాడేలేదు. కంభంలో 26. 4మీ మీ లు బిపేటలో 8.6, అర్ధవీడులో 4.0లు గిద్దలూరు లో 26 .4, రాచర్ల లో17.8 ,కోమరోలులో 0 .6 తర్లుపాడు 7.8 మీ మీ ల వర్షం నమోదైంది. మొత్తంగా 91. 6 మేలు నమోదైంది. ఇది ఇటీవలి కాలంలో సాధారణ వర్ష పాతమే . ఇటీవల వర్షం కోసం ఎదురుచూసిన రైతాంగానికి కంటి తుడుపు మాత్రమే నాని రైతులు వాపోతున్నారు.ఈ వర్షాలు సకాలంలో కురిసిఉంటే నువ్వు , సజ్జ , కొర్ర కంది పంటలు వేసిఉండేవారమని , కానీ వర్షాభావం వలన పంటలు వేయలేక పోయారు. కానీ కొంతమంది రైతులు కొంత మొత్తం విస్తీర్ణంలో వేసి నప్పటికి ప్రయోజ శూన్యమైంది. ఏదీ ఏమైనా కరువు తప్పేట్టు లేదని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.

# ప్రజలతో మమేకమైన అద్దంకి వైసిపి ఇన్చార్జి అశోక్ కుమార్

## పట్టణాభివృద్ధిపై ప్రజల నుంచి సలహాల స్వీకరణ.





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 02:**
అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ ఆదివారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక పార్కును సందర్శించిన ఆయన, అక్కడికి వచ్చిన ప్రజలతో ఆప్యాయంగా ముచ్చటించారు. ప్రజలతో ప్రత్యక్షంగా ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పార్కు సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు, అద్దంకి పట్టణ సమగ్ర అభివృద్ధికి ఇంకా ఏయే పనులు చేపట్టాలనే విషయాలపై స్థానికులతో ఆయన విస్తృతంగా చర్చించి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు.

**సంత పరిశీలన.. సామాన్యులతో కలిసి టిఫిన్..**

వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఆదివారపు సంతను అశోక్ కుమార్ పరిశీలించారు. సంతకు వచ్చిన ప్రజలు, చిన్న తరహా వ్యాపారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా స్థానికంగా ఉన్న ఒక టిఫిన్ సెంటర్ వద్ద సామాన్య ప్రజలతో కలిసి ఆయన టిఫిన్ చేశారు. ఎలాంటి బేషజాలు లేకుండా తమతో కలిసిపోయి ముచ్చటించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి అభిప్రాయాలకు అనుగుణంగానే అడుగులు వేస్తామని అశోక్ కుమార్ తెలియజేశారు.

# కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

## 5 మందికి తీవ్ర గాయాలు





**త్రిపురాంతకం పెన్ పవర్ ఆగస్టు 02**
మార్కాపురం జిల్లా ఎర్రగొండపాలెం మండలం నర్సాయ పాలెం గ్రామానికి చెందిన కూలీలు ప్రకాశం జిల్లా దర్శి కి పని నిమిత్తం వెళ్తూ ఉండగా మార్గమధ్యంలో త్రిపురాంతకం మండలం రామసముద్రం ఎస్సీ కాలనీ మలుపు వద్ద బోల్తాపడి ఐదు మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దగ్గరలోని 108 త్రిపురాంతకం అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్లి చూడగా తీవ్ర ప్రమాదం జరిగింది. అందులో దమ్మలపాటి బాలయ్యకు (31)కుడికాలు నడుము తలకి తీవ్ర గాయాలయ్యాయి. పి మస్తానమ్మ, ఎన్ .వెంకట లక్ష్మమ్మ(36), పీ మస్తానమ్మ(30) పాశం ముసలయ్య(60), కె .మస్తానమ్మ(25) వీరి నలుగురికి తలకు మరియు చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరికీ అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి దగ్గరలోని ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాల లో చేర్చడం జరిగింది. ప్రమాదం జరిగిన ఆటోలో సుమారు 16 మంది కూలీలు ఉన్నారు .108 సిబ్బంది ఈఎంటి వెన్న గాలి రెడ్డి పైలెట్ ధూపాటి శ్రీను సేవలందించారు. బాధితుల కుటుంబీకులు 108 సిబ్బంది సేవలను అభినందించారు.

# విద్యుత్ షాక్ తో లారీ డ్రైవర్ మృతి

## సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై వెంకటేశ్వరరెడ్డి

**సి ఎస్ పురం , పెన్ పవర్ ఆగస్టు 2**
మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన విషాద ఘటనలో విద్యుత్ షాక్ కు గురై ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఎక్సకవేటర్ ను ట్రాలీ లారీపై ఎక్కించుకుని ప్రధాన రహదారికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాలీ లారీపై ఉన్న ఎక్సకవేటర్ ఎత్తుగా ఉండటంతో మార్గమధ్యంలో ఉన్న త్రీ-ఫేజ్ విద్యుత్ లైన్లను తాకింది. దీంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి విద్యుత్ వాహనానికి తగిలింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ మాదినేని వెంకటసుబ్బయ్య తీవ్రంగా విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు మృతదేహాన్ని సి.ఎస్.పురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంవత్సరం అందుకున్న ఎస్సై వెం వెంకటేశ్వరరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.





# యువతకు హనుమంతుడు ఆదర్శం

– చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద

– శ్రీగిరి చిన్మయ బాల విహార్ విద్యార్థులకు త్వరలో సంగీతం నృత్యం భజన సంకీర్తనలు వంటి అంశాలలో శిక్షణ

– శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 02**
సంభాషణా చాతుర్యం క్రమశిక్షణ సత్ప్రవర్తన వినయ విధేయతలు పెద్దలను, తల్లిదండ్రులకు గురువులను గౌరవించడం, ధైర్య సాహసాలను కలిగి ఉండటం, ఎన్ని అవరోధాలు ఎదురైనా అనుకున్న కార్యాన్ని సమర్థవంతంగా పూర్తి చేయడం మంచి విషయాలను గ్రహిం చడం చెడు స్నేహాలకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం అహంకారాన్ని గర్వాన్ని దరి చేరనివ్వకుండడం, ఇంద్రియ నిగ్రహం యుక్తాయుక్త విచక్షణ వంటి విషయాలలో నేటి యువత జ్ఞాన గుణ సాగరుడు శ్రీ రామ చంద్రునికి పరమ భక్తుడునైన హనుమంతుని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చిన్మయా మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గో క్షేత్ర భవన్ లో ఏర్పాటైన శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులలో చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద పాల్గొని విద్యార్థులకు హనుమంతుని గుణగుణాలు ధైర్య సాహసాలు పౌరుష ప్రతాపాల గురించి వివరించారు. సంభాషణాచాతుర్యం విషయంలో హనుమంతుని ప్రజ్ఞను శ్రీరాముడు ఎంతగానో మెచ్చుకున్నాడని వివరించారు. సంభాషణాచాతుర్యం సౌశీల్యం వంటి విషయాలలో ప్రతి ఒక్కరూ ముఖ్యంగా నేటి యువత హనుమంతునితో పాటు స్వామి వివేకానంద వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ప్రబోధించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులలో విద్యార్థులకు భజన సంకీర్తనలు సంగీతం నృత్యం వంటి విషయాలలో శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

# మినీ స్టేడియంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకర్స్ కు ఉచిత వైద్య శిబిరం





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 02**
ప్రతి నెల మొదటి ఆదివారం వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ ఆదివారం సౌత్ బైపాస్ జంక్షన్ నందు గల డాక్టర్ పి.ఆనంద్ మిని స్టేడియం లో శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి జి .రాజరాజేశ్వరి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది పేషెంట్లు పాల్గొని ఉచితంగా బిపి, షుగర్, ఈసీజీ, హెచ్. బి, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, ఆధునిక కంటి పరీక్షలు, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు, పంటి పరీక్షలు లాంటి సుమారు ఏడు వేల రూపాయల విలువగల పరీక్షలు ఉచితంగా పొందారు. అనంతరం కరాటే, యోగా సాధన చేస్తున్న 75 మంది విద్యార్థులకు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు, దంత వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు ప్రత్యేక ఆరోగ్య సూచనలు అందించారు. పిల్లల ఎదుగుదల, పోషకాహారం, దృష్టి లోపాలు, దంత సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరం నందు సీనియర్ చీఫ్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ , ప్రముఖ జనరల్ మెడిసిన్ అండ్ డయాబెటాలజీ వైద్య నిపుణులు సానల ధీరజ్ బాబు, కంటి వైద్య నిపుణులు డాక్టర్ పురాణపు మహిత, సీనియర్ కన్సల్టెంట్ జనరల్ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్ , మినిమల్ యాక్సెస్ సర్జరీ స్పెషలిస్ట్ డాక్టర్ పిన్నక ప్రశాంత్ ,చిన్న పిల్లలు, పురిటి బిడ్డల వైద్య నిపుణులు డాక్టర్ కలంకుంట్ల గంగా సాగర్ రెడ్డి , రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, దంత వైద్య నిపుణులు డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ, అందరినీ పరీక్షించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సురేష్ పల్లా , వైద్య సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాటకాన్ని సామాజిక సంస్కరణ సాధనంగా మలచిన మహనీయుడు బళ్ళారి రాఘవ - అడిషనల్ ఎస్పీ యుగంధర్



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 02**
తెలుగు నాటక రంగ పితామహుడు, సహజ నటనకు ఆద్యుడు, నాటక సంస్కర్త తాడిపత్రి రాఘవాచార్యులు (బళ్ళారి రాఘవ) జయంతి సందర్భంగా ఆదివారం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్ బాబు, పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయంలో బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, తెలుగు నాటక రంగంపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని తెలిపారు. తెలుగు నాటక రంగ అభివృద్ధికి విశేష సేవలందించిన గొప్ప రంగస్థల నటుడు బళ్లారి రాఘవ సహజ నటనకు ప్రాధాన్యతనిస్తూ, నాటకాన్ని కేవలం వినోద సాధనంగా కాకుండా సామాజిక చైతన్యాన్ని పెంపొందించే శక్తివంతమైన వేదికగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కళను సామాజిక మార్పుకు సాధనంగా వినియోగించి, తెలుగు నాటక రంగానికి కొత్త దిశానిర్దేశం చేసిన మహనీయుడిగా బళ్లారి రాఘవను కొనియాడారు. ఆయన గొప్ప న్యాయవాది కూడా అని గుర్తు చేస్తూ, అలాంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి, ఆర్ఎస్సై తిరుపతి స్వామి,ఏ ఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇస్కాన్ మందిరంలో భద్ర బలరాం దాస్ ప్రభు ప్రత్యేక ప్రవచనం





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్ 2**
స్థానిక నెహ్రూ బజార్ జవహర్ నగర్ కాలనీలోని ఇస్కాన్ ప్రచార కేంద్రంలో ప్రత్యేక ప్రవచన కార్యక్రమం జరిగింది.తిరుమల తిరుపతి ఇస్కాన్ ప్రచార కేంద్రనికి చెందిన భద్ర బలరాం దాస్ ప్రభు,శ్యామ్ ముకుంద ప్రభు భక్తులకు కలియుగంలో హరినామ జపం యొక్క ప్రాముఖ్యత అనే అంశంపై ప్రవచనం చేశారు.ఈ కలియుగంలోని దుఃఖాలు, పాపాల నుండి బయటపడాలంటే హరినామమే ముఖ్యమని శ్రీమద్ భాగవతంలో, శ్రీ చైతన్య మహాప్రభు తెలియజేశారని వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 16 మాలలు హరే కృష్ణ మహామంత్రం జపం చేయాలని శ్రీల ప్రభుపాదుల వారు సూచించారని గుర్తుచేశారు. ఒక మాలతో ప్రారంభించి క్రమంగా 16 మాలలకు పెంచి జపం చేస్తే, ఈ కలియుగ కష్టాల నుండి బయటపడి శ్రీకృష్ణ భగవానుని అనుగ్రహం పొంది, మరణానంతరం భగవద్ధామాన్ని చేరుకోవచ్చని భద్ర బలరాం దాస్ ప్రభు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుబ్బారావు ప్రభు, కనుమల్లపూడి వెంకటేశ్వర్లు ప్రభు, రామదుగు సుబ్రహ్మణ్యం ప్రభు, రంగనాయకుల ప్రభు, శ్రీనివాసులు ప్రభు తో పాటు పలువురు మాతాజీలు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవంలో పాల్గొన్న అన్నా





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 2**
బి. పాండురంగ విఠల్ ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, విద్యా సిబ్బందిని ఆయన ఘనంగా సన్మానించి, విద్యారంగానికి వారు అందించిన సేవలను అభినందించారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నా రాంబాబు పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు సలీమ్, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని ఉద్యోగ విరమణ పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 2**
మండలంలోని ఆర్ కె పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు తదితర విద్యా సామగ్రిని దాత చల్లా మనోజ్ అందజేశారు. గత ఏడు సంవత్సరాలుగా ఆయన విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తూ సేవాభావంతో ముందుకు సాగుతున్నారు. ఈ సంవత్సరం కూడా అదే విధంగా విద్యార్థులకు సహాయం చేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. హరిబాబు, ఉపాధ్యాయులు ఆర్.వి. సౌజన్య, ఎస్ఎంసీ చైర్మన్ నాగేశ్వరి, గ్రామ పెద్దలు చావా సుబ్బయ్య, దాత చల్లా మనోజ్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాత చల్లా మనోజ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కూడా అందించిన విద్యాసామగ్రిని ఆనందంగా స్వీకరించి దాతకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పాఠశాల కార్యక్రమం విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందించడంలో దోహదపడుతుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేశారు.

# మానవత సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ





**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 2**

పొదిలిలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ జరిగింది. పొదిలికి చెందిన పీర్ల వెంకట శ్రీనివాసరావు ఆలియాస్ భవాని శ్రీను పుట్టినరోజు సందర్భంగా శ్రీను పేదలకు దుస్తులను సమకూర్చారు. ఆయా దుస్తులను మానవతా సేవా సంస్థ నాయకులు అర్హులైన పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భవాని శ్రీను లాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సమాజంలోని పేదలకు ఎంతోకొంత సాయం అందించడం తోపాటు వారిని ఆదుకోవడంలోనే ఎంతో తృప్తి ఉంటుందని వారు చెప్పారు. అనంతరం భవాని శ్రీను దంపతులను మానవత సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ముప్పవ పార్థసారధిని కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి వెంకటేశ్వర రెడ్డి, మాజీ విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాస రెడ్డి, మానవతా సంస్థ కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, కపురం శ్రీనివాసరెడ్డి, మానవతా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ స్పైసిస్ బోర్డు డైరెక్టర్ సుబ్బారావును కలసిన బిజెపి నాయకులు



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 2**

నేషనల్ స్పైసిస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరు వెంకట సుబ్బారావు ను బిజెపి నాయకులు కలిశారు. సుబ్బారావు ఇటీవలనే స్పైసిస్ బోర్డు డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని ఆదివారం నాడు బిజెపి నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుబ్బారావు బిజెపి మైనారిటీ మోర్చా నాయకులు డిఎం పీరా ను శాలువాతో సత్కరించి, ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనారిటీ నాయకులు సయ్యద్ ఖాదర్ భాష కూడా పాల్గొన్నారు.

# మహాదేవపురం అంకమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 2**

మండలంలోని మహాదేవపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అంకమ్మ తల్లి తిరుణాల మహోత్సవం సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు వేద ఆశీర్వచనం, అమ్మవారి విశేష వస్త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి అనుగ్రహంతో ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని ఆకాంక్షించారు.

# జ్ఞాపకాల జల్లు కురిపించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## గురువులను సన్మానించి ఆశీస్సులు పొందిన పూర్వ విద్యార్థులు

**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 2**

జీవితంలో ఎంత ఉన్నత స్థానాలకు ఎదిగినా విద్యాభ్యాసం చేసిన పాఠశాల, తోటి విద్యార్థులు, గురువులను మరువలేమని నిరూపిస్తూ మండల కేంద్రంలోని సి. ఎస్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 నుంచి 1997 వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా ఈ సమావేశానికి హాజరయ్యారు. చాలాకాలం తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను సందర్శించిన తాము చదువుకున్న తరగతి గదులను , ఆటస్థలం, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థి దశలో జరిగిన సరదా సంఘటనలు, ఇప్పటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు చెప్పిన విలువైన సూచనలు, పాఠశాల రోజుల్లోని అనుభవాలను గుర్తుచేసుకుంటూ నవ్వులు పూయించారు. తోటి స్నేహితులతో కలిసి సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు దిగుతూ ఆ మధుర క్షణాలను శాశ్వత జ్ఞాపకాలుగా మలుచుకున్నారు.అనంతరం విద్యా బోధనలు నేర్పి జీవితానికి బాటలు వేసిన అప్పటి ఉపాధ్యాయులు జే గోవిందయ్య పి




వెంకటేశ్వర్లు వెంకటసుబ్బయ్య రాఘవ శర్మ లను పుష్పగుచ్చాలు అందజేసి జ్ఞాపకాలు బహుకరించి శాలువాతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు పొందారు ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సమాజంలో మంచి స్థాయికి చేరుకోవడం తమకు గర్వకారణం అని అన్నారు గురువులను పాఠశాలను గుర్తు చేసుకుంటూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనంలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు అనంతరం



గురువులతో కలిసి పూర్వ విద్యార్థులందరూ భోజన విందులో పాల్గొని పాత అనుబంధాలను గుర్తు చేసుకుంటూ సాయంత్రం వరకు ఆప్యాయత ఆత్మీయత ఆనందోత్సలతో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం, పూర్వ విద్యార్థి మండల టిడిపి అధ్యక్షులు బొబ్బురి రమేష్, జి నాగేశ్వరరావు, పఠాన్ ఖాజా మస్తాన్, పెరుగు రమేష్ గణప సురేష్, పి భాస్కర్, పరమేశ్వర్ రెడ్డి, మస్తాన్ శివారెడ్డి, పూర్వ విద్యార్థినిలు కవిత, సంగీత, సుభాషిని, సృజని, సునీత తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లా కలెక్టరేట్‌లో మీకోసం






**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 02**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పిజి ఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల పరిష్కారం పై వారి అభిప్రాయాలను నేరుగా సేకరించి, పరిష్కార నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ను ఫిర్యాదుదారులు స్కాన్ చేసి తమ సమస్య పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణతో పాటు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేయడమైందని తెలిపారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందడంతో పాటు, సమస్య పరిష్కారమైన అనంతరం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను నమోదు చేసి ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# సఫాయికార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## - భోపాల్ లో సఫాయి మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 02**

అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలో భోపాల్ పట్టణంలో మోడ్ సమాజ్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సమావేశం కు ముఖ్య అతిథిగా సఫాయి మజ్దూర్ ట్రేడ్ యూనియన్ జాతీయ అధ్యక్షులు చరణ్ సింగ్ టక్ హాజరై మాట్లాడారు. సఫాయి కార్మికులను ఆయా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించ కుండా వారందరి చేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయితీ,మున్సిపాలిటీ, నగరపాలక కార్పొరేషన్ల తదితర ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేసే సఫాయి కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని, అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికుల పిల్లలందరికీ కార్పోరేట్ స్థాయిలో ఉచిత విద్య అందించడం తోపాటుగా ఇంటి స్థలాలు తదితర సంక్షేమ ఫలాలు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేయాలని డిమాండ్ చేశారు. జాతీయ సఫాయికరం చారి కమిషన్ ద్వారా అందజేసే ఎన్ ఎస్ కే ఎఫ్ డి సి రుణాలను కూడా నిలిపివేశారని వాటిని తిరిగి పునః ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఆ సమస్యను తీసుకువెళ్లేందుకు ఆయా రాష్ట్రాల నుండి సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ నేతలు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ సఫాయి మజ్దూర్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గద్దె త్యాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్య కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని శ్రమకు తగ్గ వేతనాన్ని అందించడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ సఫాయి మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ల దృష్టికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పంచాయితీ, మున్సిపల్ నగరపాలక సంస్థల లో పనిచేసే సఫాయి కార్మికుల సమస్యలను తీసుకువెళ్తామని జాతీయ కార్యవర్గంలో ఆయన చర్చించారు. మహారాష్ట్ర రాజస్థాన్ ,పశ్చిమబెంగాల్, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, తదితర రాష్ట్రాలలో సఫాయి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా రాష్ట్ర అధ్యక్షులు జాతీయ కార్యవర్గ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు త్వరలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని సమావేశంలో తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి. జై సింగ్ కర్త్య,మధ్యప్రదేశ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జగన్ దాదాజీ, రాజేష్ కటారి, ఆంధ్రప్రదేశ్ సఫాయి మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపతి అప్పారావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్, పలు రాష్ట్రాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు జాతీయ కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొన్నారు.



# సి ఎస్ పురంలో బిజెపి మండల కార్యవర్గ సమావేశం



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్ట్ 2**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం లో ఆదివారం బిజెపి మండల అధ్యక్షుల రామకృష్ణ అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో బిజెపి మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా బిజెపి సీనియర్ నాయకులు కొండిశెట్టి వెంకటరమణయ్య పాల్గొన్నారు ఈ సమావేశంలో బూత్ స్థాయి నుండి పార్టీ నిర్మాణం పూర్తి బిజెపి మండల కమిటీ నిర్మాణం వివిధ మోర్చాల మండల కమిటీ నిర్మాణం గురించి చర్చించి మోర్చా కమిటీలు, పార్టీ కమిటీలో మార్పు చేర్పులను సవరించారు ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థ ఎన్నికలలో పార్టీ తరపున పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఇండ్ల దుర్గాప్రసాద్,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, మాజీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మాదినేని లక్ష్మణ్, బిజెపి నాయకులు సాదు వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి రమణారెడ్డి, సాదు కాశీరావు, డబ్బా రాయుడు, తోట రమణయ్య, చిన్న రాయుడు, యాసం వెంకటేశ్వర్లు, తోట కనకయ్య, నారాయణ, గుర్రం నారాయణ, మన్నేపల్లి మాల్యాద్రి, జాజం చిన్న సుబ్బయ్య. ఎలమందల వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# జనసేన కార్యకర్త ముప్వ వెంకట సుబ్బయ్యకు నివాళులర్పించిన ఇమ్మడి



**తర్లుపాడు పెన్ పవర్ ఆగస్టు2**

గుర్తుతెలియని వాహనం ఢీకొని జూలై 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తర్లుపాడు మండల కేంద్రంలోని స్థానిక బీసీ కాలనీకి చెందిన జనసేన పార్టీ కార్యకర్త ముప్వ వెంకట సుబ్బయ్య చికిత్స పొందుతూ ఆగస్టు ఒకటిన మృతి చెందారు.ఈ సందర్భంగా ఆదివారం మృతుడి నివాసానికి చేరుకున్న మార్కాపురం జిల్లా జనసేన నాయకులు ఇమ్మడి కాశీనాథ్ ముప్వ వెంకట సుబ్బయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శిరిగిరి శ్రీనివాసరావు,తర్లుపాడు మండల అధ్యక్షుడు చేతుల శ్రీనివాసులు,కంభం వెంకట రమణ,బట్టగిరి మురళీధర్ రెడ్డి,సుమంత్,మహేష్ , కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ముప్వ వెంకట సుబ్బయ్యకు నివాళులర్పించారు.

# పొదిలిలో ఘనంగా నిత్యా రెడ్డి జన్మదిన వేడుకలు

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 2**

పొదిలిలో ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు, రాష్ట్ర ఆర్ఎంపి వైద్యుల సంఘం నాయకులు ఎర్రం వెంకటరెడ్డి కుమార్తె నిత్యా రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం నాడు నిత్యా రెడ్డి జన్మదిన వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్యక్రమానికి హాజరై బాలిక నిత్యా రెడ్డిని ఆశీర్వదించారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటిలి





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 02**

సంతమాగులూరు మండలం పుట్టా వారిపాలెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం అర్హులైన 148 మంది లబ్ధిదారులకు రూ. 1.48 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్ఓసీ పత్రాలు మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ప్రజావేదిక నిర్వహించి ప్రజల దగ్గర నుండి వినతి పత్రాలను స్వీకరించి, వినతులపై స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని, ఆయన సూచించారు. నియోజకవర్గంలో ప్రస్తుతం కొత్తగా వేస్తున్న విద్యుత్ స్తంభాలు మొదలకు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని ఆయన ఆగ్రహం చెందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్న రహదారులును కొత్తగా వేయించామని, ఇంకా కొన్ని రహదారులు వేయాల్సి ఉండగా ఆ రహదారులను కూడా త్వరగా కొత్త రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే అర్జీల ద్వారా అధికారులకు తెలియజేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు,మండల నాయకులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దపులి మృతి పై సమగ్ర దర్యాప్తు

### ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 02**

రాచర్ల మండలం జేపి చెరువు గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఇటీవల పెద్దపులి మృతి చెందిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు విచారణను అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణాధికారి ఉన్నతస్థాయి అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలిస్తూ, పులి మృతికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. పులి మృతికి సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులి గోర్లు మాయమైనట్లు తెలుస్తుంది. పులి వేటగాళ్ల బారినపడింద , లేక విషప్రయోగమ అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుంది , దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

## ఘనంగా నారాయణస్వామికి పూజా కార్యక్రమాలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 2**

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ను భక్తులు అధిక సంఖ్యలో సందర్శించి నారాయణ స్వామికి ప్రీతికరమైన రోజు ఆదివారం కావడంతో తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణమంతా "ఓం నమో నారాయణాయ నామస్మరణలతో మార్మోగింది ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా స్వామివారికి పవిత్ర అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోపూజ, అర్చనలు, మహా నైవేద్య కార్యక్రమాలు మంగళ వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి సమర్పించిన మహా నైవేద్యాన్ని ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసిన డాక్టర్ షేక్ గౌస్

**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 2**

మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ను మండలంలోని చెన్నపునాయునిపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ షేక్ గౌస్ మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మాజీ ఆర్మీ సుబేదార్, మేనేజర్ గంటా మురళి పాల్గొన్నారు.



# గుమ్మలంపాడు శివారులో కోడి పందేలు

## - టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి... -అదుపులోకి 9 మంది



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 02**

అక్రమ కోడి పందేల నిర్వహణపై ఒంగోలు టాస్కోఫోర్స్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. సంతనూతలపాడు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మలంపాడు గ్రామ శివారులో చేపట్టిన దాడిలో కోడి పందేలు ఆడుతున్న 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏ ఎస్ ఐ షేక్ మహబూబ్ బాషా సిబ్బంది నిర్వహించిన ఈ దాడుల్లో వారి వద్ద నుంచి 5 కోళ్ళు 7 సెల్ ఫోన్లు రూ. 9500/- నగదును స్వాధీనం చేసుకున్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై స్థానిక పోలీసులకు, డయల్ 112 కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. వారిని తదుపరి చర్యల నిమిత్తం సంతనూతలపాడు పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.

## రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రం ప్రారంభం

### మురమండ గ్రామంలో డోర్ టు డోర్ లో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం , పెన్ పవర్ ఆగస్టు 2:**కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందిస్తున్నామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియం మండలం మురమండ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. 40 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన హెల్త్ వెల్నెస్ సెంటర్ ను ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు సి.సి రోడ్లు కు ప్రారంభోత్సవం చేసారు. "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతన పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు. రూ.40 లక్షలతో గ్రామంలో వెల్నెస్ సెంటర్ను ప్రారంభించామని, వైద్యులు కూడా ఉన్నారనీ వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమ విజయాల కరపత్రాలను పంపిణీ చేశారు. చేనేతల కమ్యూనిటీ హాల్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, అన్నదేవుల చంటి, జిల్లా ప్రత్తిపాటి రామారావు చౌదరి, దేవళ్ళ రామ్మోహన్ సొసైటీ చైర్మన్ వట్టికూటి జానకి రామయ్య (దత్తుడు), గట్టి సుబ్బారావు, ఎంపీడీవో రమేష్, ఎంఆర్ఓ శ్రీనివాస్, గన్ని రామారావు, బాబి, మిద్దె గోపి, ఇల్లపు హనుమంతు, నక్కా రాజు, మాజీ ఉప సర్పంచ్ చౌదరి, సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అక్కమ్మ తల్లి ఆలయ మహోత్సవం లో పాల్గొన్న చందన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**రూరల్ నియోజకవర్గం మండలం శాటిలైట్ సిటీ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గురజాల అక్కమ్మ తల్లి ఆలయ 35వ మహోత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ మహోత్సవంలో మాజీ రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి చందన నాగేశ్వర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహ కులు చందన నాగేశ్వర్ ను ఆహ్వానించి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

## అక్కమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసిన రూరల్ ఎం ఎల్ ఎ గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 2:**రూరల్ మండలం సాటిలైట్ సిటీ గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ గురజాల అక్కమ్మ తల్లి 35వ జాతర ఘనంగా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితోపాటు ఎంఎస్ఆర్ శ్రీను, చౌడాడ లాజర్, బైరెత్తి సరోజినీ దేవి, గెద్దాడ కృష్ణ, పెంకె కోటేశ్వరరావు, తనుబుద్ధి సుబ్బయ్య, చౌడాడ సునీల్, బొమ్మ శ్రీను, రొంకాని రవి, పుచ్చ గోవింద్, ఉమా మహేష్, అలంకార శ్రీను తదితరులు ఉన్నారు.

## నారాయణపురంలో ఆషాడ సారె కోసం మహిళల భక్తి ఊరేగింపు




**పెన్ పవర్ -- ఉంగుటూరుఆగస్టు 02**నారాయణపురం గ్రామంలోని శ్రీ కోట్లమ్మ అమ్మవారికి ఆషాడ సారె సమర్పించేందుకు ఆదివారం మహిళలు భారీ సంఖ్యలో భక్తి ఊరేగింపు నిర్వహించారు.

ఏకరూప చీరలు ధరించిన మహిళలు చలివిడి, స్వీట్లు, ఇతర నైవేద్యాలతో పాటు మంగళ వాయిద్యాల నడుమ, బాణాసంచా కాల్పుల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి కోట్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు.

అనంతరం స్థానిక శ్రీ కోదండరామాలయం వద్ద మహిళలు భక్తి ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరగగా, కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించిన ముత్తుముల ఎల్లారెడ్డి

### పలు గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను పంపిణీ చేసిన ఎల్లారెడ్డి





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 2**

కొమరోలు మండలం బాదినేని పల్లి పంచాయతీలోని పాయల పల్లి గ్రామం తో పాటు శని, ఆదివారాలలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ కో కన్వీనర్, బాదినేని పల్లె యూనిట్ ఇన్చార్జి ముత్తముల ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనల మేరకు ఎల్లారెడ్డి గత వారం రోజులుగా పలు గ్రామాలలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం పాయల పల్లి గ్రామంలో, ఆదివారం మరికొన్ని గ్రామాలలో కార్యక్రమం నిర్వహించి ప్రజలకు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కరపత్రాలను పంపిణీ చేసి గత రెండేళ్లలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరించారు. వాటితో పాటు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి గత రెండు సంవత్సరాలుగా గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చేస్తున్న కృషిని వివరించారు.ఆ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, నరసింహులు, ఓబులేసు తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా పింగళి వెంకయ్య జయంతి



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 02**

సంతమాగులూరు శాఖా గ్రంథాలయం నందు ఆదివారం జాతీయ జెండా రూపకర్త స్వర్గీయ పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించడం జరిగింది. అనంతరం చదవటం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులచే జాతీయ భక్తి పాటలు పాడించడం జరిగినది. ఈ కార్యక్రమంలో బారీగా విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లలందరూ గ్రంథాలయంలో చదవటం అంటే మాకు చాలా ఇష్టమని తాము ఖాళీ సమయాల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదువుకుంటామని, చదవటం వల్ల అన్ని విధాలా తెలివితేటలు పెరుగుతాయని విద్యార్థులు తెలిపారు. గ్రంథపాలకులు బాదం విజయభాస్కర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# టీమిండియాకు ఎదురుదెబ్బ.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు బుమ్రా కష్టమే!

- మోకాలి గాయంతో శ్రీలంక టెస్టు సిరీస్‌కు బుమ్రా దూరం
- ఇంగ్లండ్ పర్యటనలో అయిన గాయం నుంచి ఇంకా కోలుకోని బుమ్రా!
- వైద్యుల సూచనతో విశ్రాంతికి మొగ్గుచూపిన బీసీసీఐ
- బుమ్రా స్థానంలో అకిబ్ నబీని తీసుకునే అవకాశం
- ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ప్రధాన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎడమ మోకాలిలో అసౌకర్యంతో బాధపడుతున్న అతనికి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరింత సమయం అవసరమని బీసీసీఐ వైద్య బృందం భావిస్తోంది. దీంతో ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఈ కీలక సిరీస్‌కు బుమ్రా సేవలు కోల్పోవడం దాదాపు ఖాయమైంది.

వివరాల్లోకి వెళ్తే, గత నెల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా గాయపడ్డాడు. జులై 19న కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అతని ఎడమ మోకాలికి దెబ్బ తగలడంతో వాపు వచ్చింది. అప్పటి నుంచి అతను బౌలింగ్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ఉన్న బుమ్రా, ఇంకా బౌలింగ్ ప్రాక్టీస్ ప్రారంభించలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. "ఇప్పుడే అతడిని ఆడిస్తే గాయం తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే, బుమ్రా పూర్తిగా కోలుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ నేపథ్యంలో శ్రీలంక పర్యటనకు అతను దూరంగా ఉండొచ్చు" అని ఓ అధికారి ఐఏఎన్ఎస్‌కు తెలిపారు. వాస్తవానికి, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్టు జట్టుకు బుమ్రాను ఎంపిక చేసినప్పటికీ, ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే తుది జట్టులో ఉంటాడని సెలక్టర్లు స్పష్టం చేశారు. ఇప్పుడు అతను దూరం కానుండటంతో, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతని స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించనుంది. జమ్మూ కశ్మీర్ సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ అకిబ్ నబీ ఈ రేసులో ముందున్నాడు. ఇటీవల రంజీ ట్రోఫీలో 60 వికెట్లతో సత్తాచాటిన నబీ, ఇండియా-ఏ తరపున శ్రీలంక పర్యటనలోనూ రాణించాడు.

బుమ్రా గైర్హాజరీతో భారత పేస్ బౌలింగ్ విభాగంలో మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ మాత్రమే మిగిలారు. భారత జట్టు ఆగస్టు 4న శ్రీలంకకు బయలుదేరి వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 7 నుంచి 9 వరకు కొలంబోలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. అనంతరం గాలే వేదికగా ఆగస్టు 15న తొలి టెస్టు, కొలంబోలో ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగుతాయి.

# కెప్టెన్‌గా తిలక్ వర్మ.. దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ జట్టు ఇదే!

- దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ కెప్టెన్‌గా తిలక్ వర్మ ఎంపిక
- ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు
- గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ స్మరణ్, కరుణ్ నాయర్‌కు జట్టులో చోటు
- గతేడాది ఫైనలిస్ట్ కావడంతో నేరుగా సెమీఫైనల్‌కు అర్హత
- ఈ నెల 23 నుంచి బెంగళూరు వేదికగా ఈ టోర్నమెంట్ ప్రారంభం




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీ కోసం సౌత్ జోన్ తమ జట్టును ప్రకటించింది. భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్, హైదరాబాద్ యువ సంచలనం తిలక్ వర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఆంధ్ర జట్టుకు చెందిన సీనియర్ బ్యాటర్ రికీ భుయ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. నేడు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీశ్ బాబు నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఆంధ్ర మాజీ రంజీ ఆటగాడు ఆర్వీ చంద్రమౌళి ప్రసాద్ ఈ సెలక్షన్ ప్యానెల్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశంలో సౌత్ జోన్‌లోని ఏడు సభ్య సంఘాలైన ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, గోవా, పాండిచ్చేరి, కేరళ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్టుకు హెడ్ కోచ్‌గా ఆంధ్రకు చెందిన అనుభవజ్ఞుడైన లెవల్ 2 కోచ్ ఎంఎన్ విక్రమ్ వర్మను నియమించారు.

15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో యువత, అనుభవం చక్కగా మేళవించారు. భారత జట్టుకు ఆడిన వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కింది. 2025/26 రంజీ ట్రోఫీ సీజన్‌లో 950 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన కర్ణాటక యువ ఆటగాడు ఆర్. స్మరణ్, హైదరాబాద్‌కు చెందిన కె. హిమతేజ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఇటీవలే జింబాబ్వేపై 3-0తో టీ20 సిరీస్ గెలిచిన భారత జట్టులో తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు. శ్రీలంక 'ఎ'తో సిరీస్ గెలిచిన భారత 'ఎ' జట్టులో సభ్యులుగా ఉన్న షేక్ రషీద్ (ఆంధ్ర), ఎన్. జగదీశన్ (తమిళనాడు) కూడా ఈ జట్టులో ఉన్నారు. వికెట్ కీపింగ్ బాధ్యతలను జగదీశన్ నిర్వర్తించనున్నాడు. గోవా బ్యాటర్ అభినవ్ తేజ్రానా కూడా జట్టులో స్థానం సంపాదించాడు.

గత ఎడిషన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు చేరి సెంట్రల్ జోన్ చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ కారణంగా ఈసారి నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఆగస్టు 30న బీసీసీఐ సీఓఈ గ్రౌండ్ 2లో జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో క్వార్టర్‌ఫైనల్ 2 విజేతతో సౌత్ జోన్ తలపడుతుంది.

బౌలింగ్ విభాగం కూడా పటిష్ఠంగా ఉంది. స్పిన్ బాధ్యతలను లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్, లెగ్ స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ పంచుకోనున్నారు. పేస్ విభాగంలో కె. సాయితేజ, త్రిపురాన విజయ్, విద్వత్ కావరప్ప, ఎం.డి. నిదీశ్ ఉన్నారు.

**సౌత్ జోన్ జట్టు:**
ఎన్. తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్ (వైస్ కెప్టెన్), అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె.ఎం. హిమతేజ, ఆర్. స్మరణ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), కరుణ్ నాయర్, తనయ్ త్యాగరాజన్, శ్రేయస్ గోపాల్, కె. సాయితేజ, టి. విజయ్, విద్వత్ కావరప్ప, హెచ్. అమన్ ఖాన్, ఎం.డి. నిదీశ్.

# నా లక్ష్యం అది కాదు.. ఇప్పుడు కేవలం దాని కోసమే ఆడుతున్నా: భువనేశ్వర్ కుమార్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్, భవిష్యత్తు ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. జాతీయ జట్టులోకి తిరిగి రావాలన్నదే ఇప్పుడు తన ప్రధాన లక్ష్యం కాదని, కేవలం ఆటపై ఉన్న ప్రేమతోనే క్రికెట్ కొనసాగిస్తున్నానని స్పష్టం చేశాడు. భారత జట్టుకు దూరమైన జీవితంతో తాను సంతృప్తిగా ఉన్నానని, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటను ఆస్వాదిస్తున్నానని తెలిపాడు. 36 ఏళ్ల భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటివరకు 21 టెస్టులు, 121 వన్డేలు, 87 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున ఆడి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఆర్‌సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "దేశం తరఫున ఆడాలన్న నా కల ఇప్పటికే నెరవేరింది. ఇప్పుడు మళ్లీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. మళ్లీ అవకాశం వస్తే గొప్ప విషయమే. కానీ, దానికోసం ఒత్తిడికి గురికావడం లేదు. ప్రస్తుతం నేను ఆడుతున్నది కేవలం ఆటపై ఉన్న ఇష్టం, క్రమశిక్షణతోనే" అని వివరించాడు. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్, యూపీ టీ20 లీగ్‌లలో ఆడుతూ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నట్లు తెలిపాడు. జట్టులో చోటు కోల్పోయినందుకు తనకెలాంటి పశ్చాత్తాపం లేదని, ఈ విషయంలో తన కుటుంబం అందించిన మద్దతు ఎంతో కీలకమని భువీ పేర్కొన్నాడు. "ఇంట్లో మేము క్రికెట్ గురించి అస్సలు మాట్లాడుకోము. జట్టులో నా స్థానం గురించి, నన్ను ఎందుకు ఎంపిక చేయలేదనే చర్చలు ఉండవు. క్రీడల్లో తరాల మార్పు సహజమని నేను అర్థం చేసుకున్నాను. ఈ పరిస్థితిని ఎదుర్కొన్న మొదటి ఆటగాడిని నేను కాదు, చివరివాడినీ కాను. అందుకే నేను ఉన్న స్థితిలో సంతోషంగా ఉన్నాను" అని అన్నాడు. భారత్‌లో ఫాస్ట్ బౌలింగ్ విప్లవానికి ఐపీఎల్‌తో పాటు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ, మాజీ కోచ్ రవిశాస్త్రిలే కారణమని భువనేశ్వర్ ప్రశంసించాడు. "భారత పేస్ దళాన్ని నిర్మించాలనే స్పష్టమైన విజన్‌తో కోహ్లీ, శాస్త్రి పనిచేశారు. విదేశీ పర్యటనలకు ముందు స్వదేశంలో కూడా పేసర్లకు అనుకూలించే పిచ్‌లను తయారు చేయించి మమ్మల్ని సిద్ధం చేశారు. అలాంటి చిన్న నిర్ణయాలే పెద్ద మార్పులకు కారణమయ్యాయి" అని గుర్తుచేసుకున్నాడు. తన చిన్నతనంలో మీరట్‌లోని అకాడమీలో సీనియర్ అయిన ప్రవీణ్ కుమార్ బౌలింగ్‌ను చూసి ఎంతో నేర్చుకున్నానని, అతని బౌలింగ్ శైలి తనపై చాలా ప్రభావం చూపిందని భువనేశ్వర్ చెప్పుకొచ్చాడు.




# ఆపుకుందామన్నా ఆపుకోలేకపోయిన జాన్వీ చివరికిలా



టాలీవుడ్ లో దేవర, పెద్ది సినిమాల తర్వాత కోలీవుడ్ పై దృష్టి సారించింది జాన్వీకపూర్. అక్కడ తన మొదటి ప్రాజెక్ట్ ప్రకటన ఉంటుందని ప్రచారం సాగుతోంది. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న తన ఫ్యాన్స్ కోసం జాన్వీ ట్రీట్ ఆగడం లేదు. అందాల భామ జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో కావాల్సినంతా వినోదం పంచుతున్నారు. తన లేటెస్ట్ ఫోటోషూట్లు, అవుట్‌ఫిట్లతో అభిమానులను నిరంతరం అలరించే ఈ బ్యూటీ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన కొన్ని క్యూట్ అండ్ స్టైలిష్ ఫోటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఫోటోలను షేర్ చేస్తూ జాన్వీ కపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ సరదా క్యాప్షన్ రాసుకొచ్చారు. నేను ఆపుకుందామనే ప్రయత్నించాను.. కానీ ఈ పిక్స్ చాలా క్యూట్‌గా ఉండటంతో పోస్ట్ చేయకుండా ఉండలేకపోయాను! అంటూ దిష్టి తగలకుండా దిష్ఠి కన్ను ఎమోజీని క్యాప్షన్‌గా జోడించారు. ముఖ్యంగా ఈ ఫోటోషూట్ లో ఆకుపచ్చ రంగు దుస్తుల్లో జాన్వీ మెరిసిపోతున్న తీరు చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు.

ఈ పోస్ట్ చూసిన సినీ సెలబ్రిటీలతో పాటు లక్షలాది మంది అభిమానులు కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని కురిపిస్తున్నారు. ప్రముఖ నటి సోనమ్ బాజ్వాతో పాటు పలువురు డిజైనర్లు, శ్రేయోభిలాషులు జాన్వీ అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు పెట్టారు. బార్బీ డాళ్‌లా ఎంతో క్యూట్‌గా, ఎలిగెంట్‌గా ఉన్నారు! అంటూ ఫ్యాన్స్ క్యూట్ జాన్వీ లుక్స్‌పై ఈలలు వేస్తున్నారు.

మరోవైపు కామెంట్ సెక్షన్‌లో అభిమానుల హడావుడి మామూలుగా లేదు. చాలామంది నెటిజన్లు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఈ చిన్నారికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ సుదీర్ఘమైన మెసేజ్‌లు పోస్ట్ చేశారు. అలాగే పాపులర్ ఫ్యాన్స్ గ్రూప్స్ లలో కూడా పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తూ ఈ పోస్ట్‌ను సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడానికి పోటీ పడ్డారు.

ప్రస్తుతం ఈ పోస్ట్‌కి 4 లక్షలకు పైగా లైకులు, వేల సంఖ్యలో కామెంట్లు వచ్చి చేరుతుండటంతో జాన్వీ కపూర్ పిక్స్ నెట్టింట కాక రేపుతున్నాయి. సినిమా ఆఫర్లతో ఎంత బిజీగా ఉన్నా.. ఇలాంటి సరదా ఫోటోలతో అభిమానులకు నిరంతరం టచ్‌లో ఉండటం జాన్వీకే చెల్లిందని కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే పెద్ది తర్వాత జాన్వీ కపూర్ నటించే సినిమాలకు సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com